క్లుప్తంగా

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవాసంస్థల ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అక్కయ్యపాలెంలోని సాధ మందిరంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందిన 58మంది మహిళలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళల ఆర్థికపురోగతే లక్ష్యంగా సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో దశాబ్దాలుగా పలు రకాల శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవడంతో పాటు దైనందిన జీవితంలో విలువలు అలవరచుకోవాలని సూచించారు. అనంతరం పలువురు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



పైడిరాజు (ఫైల్)

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యారు. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆరిలోవ మూడో సెక్టార్ కనకదుర్గానగర్‌కు చెందిన గొలగాని పైడిరాజు(72) ఈ నెల 6న రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి కిరాణా షాపునకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆరిలోవతో పాటు పలు ప్రాంతాలలో వెదికినా ఫలితం లేకపోయింది. దీంతో పైడిరాజు కుమారుడు శ్రీనివాస్ ఆరిలోవ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ రమణ తెలిపారు. పైడిరాజు ఆచూకీ తెలిసినవారు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో నీలకంఠ దివస్



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న స్వామీజీలు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్ ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో బుధవారం నీలకంఠ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌మార్గ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వామీజీలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరానగర్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో పాటు పాత డెయిరీఫారం, హనుమంతవాక, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై గడుపుతున్న నిరుపేదలకు ఆహారం అందజేశారు. వేడుకలలో ఆచార్య సామ్యానంద అవధూత, త్రిలోకేశానంద అవధూత తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసదన్‌లో సహస్ర దీపాలంకరణ



దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని ప్రేమ సదన్ మందిరంలో శ్రీచక్రమేరు స్వరూప శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి సాయీశ్వర స్ఫటిక లింగానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం వేదపఠనం, నామ సంకీర్తన, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పున్నమి వెన్నెలలో మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సత్యసాయి బాబాకు మంగళహారతి ఇచ్చారు. శ్రీ సత్యసాయి సిటీ సమితి కన్వీనర్ డీవీవీఎస్ రాజు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పౌర్ణమి పూజలు

దాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి దేవస్థానంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం జరిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యత ప్రశ్నార్థకం



ముక్కముక్కలుగా వేసిన రోడ్డు, తేలిపోయిన రాళ్లు



కనీసం అంగుళం మందం కూడా లేని రోడ్డు

- ఎంవీపీలో అధ్వానంగా రోడ్ల నిర్మాణం
- పలుచోట్ల తేలిపోయిన రాళ్లు
- అంగుళం మందం కూడా కనిపించని వైనం





రోలర్‌తో చదును చేయకుండా వదిలేసిన రోడ్డు అంచులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో జీవీఎంసీ చేపట్టిన రోడ్ల నిర్మాణం అధ్వానంగా ఉంది. పై పై పూతలతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కాలనీలోని సెక్టార్-4, సెక్టార్-5 ప్రాంతాలను ఆనుకొని ఇటీవల రోడ్ల నిర్మాణం జరిగింది. గిరిజన భవన్ నుంచి సెక్టార్-5 మీదుగా సెక్టార్-8ను కలిపే పలు రోడ్లు నిర్మించారు. అయితే ఆయా రోడ్ల నిర్మాణంలో కనీస నాణ్యత పాటించలేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. రూ.40 లక్షలతో రెండు దశలుగా ఈ నిర్మాణ పనులను చేపట్టారు. జీఎస్టీ మినహాయిస్తే ఒక్కో దశలో రూ.18 లక్షల చొప్పున పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే కొత్తగా వేసిన రోడ్ల పొడవునా పలు చోట్ల రాళ్లు తేలిపోయాయి. రోడ్డు రోలర్‌తో సరిగ్గా తొక్కించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఆయా పనులను స్థానిక ఇంజినీరింగ్ ఏఈతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉన్నా.. నిర్మాణంలో లోపాలు ఎలా జరిగాయని ప్రశ్నిస్తున్నారు. చాలా చోట్ల రహదారుల మందం అంగుళం కూడా లేకపోవడం కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలకు తావిస్తోంది. నాణ్యత ప్రమాణాలు పాటించడంలో అంతులేని నిర్లక్ష్యం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే సెక్టార్‌లో నిర్మాణాలు..

ఎంవీపీ సెక్టార్-5లో రూ.40 లక్షలతో రోడ్లు నిర్మించారు. ఈ రోడ్లు అన్నీ ఒకే సెక్టార్‌వి కావడం అనుమానాలకు తావిస్తోంది. ఎంవీపీ కాలనీకి సంబంధించి పలు సెక్టార్లలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కానీ, ఆ రోడ్ల గురించి కనీసం పట్టించుకోని జోన్-8 ఇంజినీరింగ్ విభాగం సెక్టార్-5లోనే రోడ్లు నిర్మించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంతో పాటు నివాస సముదాయం ఈ సెక్టార్‌లో ఉన్న కారణంగానే ఇంజినీరింగ్ అధికారులు అత్యుత్సాహంతో పెద్ద ఎత్తున అక్కడ రోడ్ల నిర్మాణం చేపట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అక్కడ కూడా రోడ్లు వేసి ఉండాల్సిందని అంటున్నారు.

పరిశీలిస్తాం

ప్రస్తుతం సెక్టార్-5లో జరిగిన రోడ్ల నిర్మాణ పనులు గతంలో మంజూరైనవే. నేను ఇటీవలే ఈ ప్రాంత ఏఈగా బాధ్యతలు తీసుకున్నాను. ఒకే సెక్టార్‌కు చెందిన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు, మంజూరు విషయం నాకు తెలియదు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉంటే పరిశీలిస్తాం.

– అప్పలనాయుడు, ఏఈ, ఇంజినీరింగ్ విభాగం

ప్రయాణం.. ప్రమాదకరం



ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతున్న కళాశాలల విద్యార్థులు

ఆరిలోవ: ప్రమాదకరమని తెలిసినా విద్యార్థులు బస్సుల్లో ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. నగరం నుంచి మధురవాడ వైపు ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్తున్న బస్సుల్లో ఇటువంటి పరిస్థితి కనిపిస్తోంది. బుధవారం ఉదయం కూడా ఇదే పరిస్థితి.. మధురవాడ వైపు వెళ్తున్న ప్రతీ సిటీ బస్‌లో కళాశాల విద్యార్థులు ఇలా వేలాడుతూనే ప్రయాణించారు. బస్‌లు ప్రయాణికులతో రద్దీగా ఉన్నప్పటికీ, ఓపక్క సమయానికి కళాశాలకు వెళ్లాలనే ఆలోచన, మరో పక్క ఎంజాయ్ చేయాలనే ఆలోచనతో వేలాడే ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. మరి కొన్ని బస్సుల్లో లోపలికి వెళ్లి సర్దుకునే వీలున్నా కొంతమంది ఇలా ఫుట్‌బోర్డ్‌లపై వేలాడుతూ విన్యాసాలు చేస్తున్నారు. విద్యార్థులకు ఎలా ఉన్నా.. వారి విన్యాసాలు చూస్తున్న వారికి మాత్రం గగుర్పాటు కలిగిస్తున్నాయి. విద్యార్థులు ఆలోచించి, సురక్షిత ప్రయాణం చేయాలని హితవు పలుకుతున్నారు.

జెడ్ఈడీ, లీన్ సర్టిఫికేషన్లపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీ చాంబర్స్), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) సహకారంతో జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్(జెడ్ఈడీ), లీన్ సర్టిఫికేషన్లపై బుధవారం నగరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ జోన్ వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి మాట్లాడుతూ ఉత్పత్తి విలువ, మార్కెట్ రీచ్‌ను మెరుగుపరచడంలో నాణ్యత ధ్రువీకరణల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఎస్ఎంక్యూబీ సలహాదారుడు ఇ.వేణుగోపాల్ మాట్లాడుతూ భారతదేశంలో అక్రిడిటేషన్, ధ్రువీకరణ ప్రక్రియల్లో క్యూసీఐ బోర్డుల పాత్రను తెలిపారు. క్యూసీఐ ఎంపానెల్డ్ నిపుణుడు వెంకట సత్య వినోద్ ప్రసంగిస్తూ జెడ్ఈడీ సర్టిఫికేషన్, ఎల్ఈఏఎస్ పథకాలను గురించి వివరించారు. అనంతరం టూరిజం సబ్ కమిటీ చైర్‌పర్సన్ పవన్ కార్తీక్ మాట్లాడుతూ వ్యాపారాల కోసం ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ఎంతగానో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు పన్ను మినహాయింపునకు వినతి

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆదాయపన్ను శాఖ అధికారులను కలసి వినతి పత్రం అందజేసినట్లు డాక్టర్ ఎం.సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీలు అత్యధికంగా పనిచేస్తున్నందున వర్సిటీ నుంచి లెటర్ పంపిస్తే, దీనిపై పరిశీలన చేస్తామన్నారని సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ అధికారులు ఫామ్-13 అప్లై చేసి అతిథి అధ్యాపకులకు టీడీఎస్ నుండి మినహాయింపు పొందే అవకాశం కల్పించాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో వర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఆరిలోవ: పేదల కోసం చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పలుచోట్ల అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామమూర్తి, జె.రవి బుధవారం ప్రకటనలో కోరారు. ఈ నివాస సముదాయాలలో మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. తాగునీరు, రహదార్లు తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి టిడ్కో ఇళ్ల సముదాయాలలో రామాలయాలు నిర్మిస్తామనడం మంచి విధానం కాదని తెలిపారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దీనివల్ల మత స్వేచ్ఛకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే పైప్‌లైన్ ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా గల అంబేడ్కర్ కల్యాణ మండపం వద్ద లీక్ కావడంతో తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ బుధవారం తెలిపారు. జోన్ – 3, 5, 8 పరిధిలో ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

- జోన్ – 3 పరిధిలో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీనగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్ – 16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియా, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 ఫీట్‌రోడ్డు తదితర ప్రాంతాలు.
- జోన్ – 5 పరిధిలో లక్ష్మీనారాయణపురం – 1, 2, లెపర్సీకాలనీ, కస్తూరినగర్ –1, శాంతినగర్ – 1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాష్‌నగర్, మహాత్మాగాంధీనగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, అరుంధతినగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార ఉడా లే అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం ఉడా లేఅవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతినగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హౌస్సేన్‌నగర్, ఆర్‌పీపేట తదితర ప్రాంతాలు.
- జోన్ – 8 పరిధిలో లక్ష్మీనగర్ – ఎఫ్ బ్లాక్ పార్ట్, సీ, డీ బ్లాక్ పార్ట్, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ ప్రిన్సిపాల్‌కు పురస్కారం



తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న వాణిశ్రీ

మద్దిలపాలెం: స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీకి సీబీడీటీ గ్లోబల్ ఎడ్యుకేషనల్ ప్రమోషన్ అవార్డు – 2025 లభించింది. పిల్లలకు ఒత్తిడి లేని సంపూర్ణ విద్యను అందించే వినూత్న విధానానికి గాను ఆమె ఈ అవార్డును దక్కించుకున్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ ఈ పురస్కారం రావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



డార్విన్ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం: విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. డార్విన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి కళాశాల స్థాయిని పెంచాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయ మాట్లాడుతూ విద్యార్థులు తమ జ్ఞానాన్ని సమాజ ప్రగతికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పి.ఉమామహేశ్వరరావు, జి.విజయ ప్రతాప్, జంతుశాస్త్ర అధ్యాపకులు శాంతి ప్రభ, రామారావు, భూషణ్ రావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



జలాభిషేకం కోసం నీరు తీసుకొస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ చేశారు. అనంతరం అమ్మవారికి మాఘ పౌర్ణమి సందర్భంగా మహా కుంభమేళా ప్రయాగరాజ నుంచి తీసుకొచ్చిన గంగా యమునా సరస్వతి నదుల పవిత్ర జలాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకం జరిపారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీరతో పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీఎరుకుమాంబ అమ్మవారు దేవతామూర్తిగా (పార్వతీదేవి) ఈ ప్రాంతంలో అవతరించారని నమ్మే భక్తులు ప్రతీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు... మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పసుపు నీళ్లతో అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పసుపు నీళ్లతో అభిషేకం చేయడం వల్ల వారి కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రతీ బుధవారం దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూ కాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలిత నగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్‌తోపాటు గాజువాక, దువ్వాడ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వహస్తాలతో పసుపు నీళ్లు అమ్మవారికి పోస్తారని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సమత కళాశాల విద్యార్థి ప్రతిభ



మాలిక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఇటీవల నగరంలోని పోర్టు స్టేడియం వేదికగా జరిగిన 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో సమత కళాశాలకు చెందిన షేక్ మాలిక్ ప్రతిభ కనబరిచాడు. కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న షేక్ మాలిక్ కరాటే 18 ఏళ్ల వ్యక్తిగత విభాగంలో పోటీపడి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు బుధవారం కళాశాలలో మాలిక్‌ను అభినందించారు.

‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’పై అవగాహన



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు కోరారు. ప్రతినెలా మూడో శనివారం కళాశాలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు కళాశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని, డస్ట్‌బిన్లు వినియోగించాలని తెలిపారు. ఆవరణలో పిచ్చిమొక్కలు ఏరివేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి.ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, హరిత కృష్ణ ఎకో క్లబ్ కో-ఆర్డినేటర్ పద్మజ విద్యార్థులు, కంటింజెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ నఫీసా బరోడావాలా

సీతంపేట : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను స్థానిక విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ రంగంలో 22 సంవత్సరాల అనుభవం ఉన్న నఫీసా బరోడావాలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనే యువత జస్ట్ ఏ మినిట్ సెషన్ ద్వారా తమ ఆలోచనా సామర్థ్యాలను పదును పెట్టుకుంటారని తెలిపారు. మాక్ ఇంటర్వ్యూ డ్రిల్ ద్వారా అనుభవాన్ని పొందుతారన్నారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టీమ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న స్కిల్స్ ప్రాక్టీస్ చేయడం ద్వారా తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూలో విజయం సాధిస్తారని తెలిపారు.

కనులపండువగా లలితాదేవి నగరోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీలలితాదేవి పల్లకీ ఊరేగింపు

సీతంపేట : శ్రీలలితాపీఠం వార్షికోత్సవాల ముగింపు, మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీలలితాదేవిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై బుధవారం సాయంత్రం ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పెటగుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, డైమండ్ పార్క్, దొండపర్తి కూడలి, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. అమ్మవారి పల్లకీ మోయడానికి భక్తులు పోటీ పడ్డారు. అడుగడుగునా అమ్మవారికి హారతులు, టెంకాయలతో నీరాజనాలు పలికారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీస్వామి టాపులేని కారులో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా ఉదయం పీఠంలో లలితాదీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమించారు. అలాగే గురుపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

దాబాగార్డెన్స్ : ఆయుర్వేద రంగంలో నిష్ణాతులైన డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజులపాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల ఔషధాలయంలో బుధవారం శిబిరం వివరాలు వెల్లడించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మురళీనగర్, శ్రీదేవి పార్క్ వద్ద గల ఔషధాలయంలోనూ, 18, 19న జీవీఎంసీ ఎదురుగా గల రామ్‌నగర్‌లో గల వైద్యరాజ్ ఔషధాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్లు దినూప్ తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటీస్ (కీళ్ల వ్యాధులు), పక్షవాతం, నడుము నొప్పి, స్పాండిలైటీస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక చికిత్స అందజేయనున్నారని చెప్పారు. అవసరమైన వారు 80080 00670, 90305 68264లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదాన శిబిరంలో అప్పలనాయుడు, తదితరులు

దాబాగార్డెన్స్ : జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ విశాఖ డిస్పెన్సరీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారిలో ఎక్కువ మంది రక్తం పోవడంతో మరణిస్తున్నారన్నారు. అందువల్లే రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. రక్తదానం చేసిన 42 మంది ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణి నీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, అసిస్టెంట్ మేనేజర్ జీవీ గౌరి, అసోసియేషన్ నాయకులు, డిస్పెన్సరీ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.